కథ

# నాన్న టికెట్

మంజీత కుమార్
98496 49594

చల్లని పిల్ల తుంపరలు వరండాను తడిపేస్తున్నాయి. వాలు కుర్చీలో కూర్చుని వర్షాన్ని చూస్తుంటే.. అదో హాయి!

ఇంతలో.. ఒక చేతిలో వేడివేడి పకోడీల ప్లేటు, మరో చేతిలో గ్లాసెడు టీ తీసుకొచ్చింది మధురమ్మ. భర్త అలవాట్లు, అభిరుచులు ఆమెకు తెలియనివి కావుగా.

''ఇదిగోండి మాస్టారూ... నేలపై కూర్చుంటున్నాను. మాటిమాటికీ నన్ను పైకి లేపకండిక''..

'అన్నీ అందించేశాను!' అన్నట్టు కనుబొమలు ఎగరేస్తూ అన్నది మధురమ్మ.

''సర్లే అమ్మడు. ఇలా వాన పడటం.. అలా వేడివేడి నూనెలో పకోడీలు ఈదడం ఈనాటిదా!? మన పెళ్లయిన నాటినుంచి చూస్తున్నదేగా! అయినా ఇన్నిన్ని పకోడీలు చేస్తావు.. మొహమాటానికా అన్నట్టు ఒక్కటో రెండో తింటావు ఎందుకని? డైటింగా ఏమిటీ?'' వేళాకోళంగా అన్నాడు కృష్ణలీలయ్య.

''డైటింగా! నా ముఖమా! ఏమిటోనండీ ఆ నూనె వాసన అంతసేపు పీల్చుకునేసరికి తినాలన్న ఆశపోతుంది. అందుకే తినలేను. అయినా మీరు ఆవురావురుమంటూ ఆరగిస్తుంటే నా కడుపు నిండిపోతుందిలెండి'' అని సిగ్గుతో తలదించుకుంది.

''అబ్బో.. పడుచుపిల్ల వచ్చింది. కొత్త పెళ్లికూతురిలా ఎలా సిగ్గుపడుతున్నావో చూడు'' అని భార్యను ఇంకాస్త ఏడిపించాడు కృష్ణలీలయ్య.

''చాల్లెండి .. పెళ్లయి ఇన్నేళ్లు కావస్తున్నా ఇంకా మీ చిలిపితనం పోలేదు'' భర్తను సూటిగా చూడలేక నేలపై కాలి వేలితో రాస్తూ అంది మధురమ్మ.

''నా పేరే కృష్ణుడు కదా అమ్మడు'' అని తియ్యగా నవ్వాడు కృష్ణలీలయ్య.

అలా ఇద్దరూ వర్షాన్ని ఆస్వాదిస్తూ హాయిగా నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకొంటూనే ఉన్నారు. అలా ఎంతసేపు కూర్చున్నారో వారికే తెలియదు. వాన ఎప్పుడు ఆగిపోయిందో గమనించనే లేదు.

* * *

గోవర్ధనపురంలో నివసించే మధురమ్మ, కృష్ణలీలయ్య దంపతులకు ఐదుగురు సంతానం. ఇద్దరు ఆడపిల్లలు, ముగ్గురు మగపిల్లలు. అందరూ చదువులని విదేశాలకు వెళ్లి, పెళ్లిళ్లు చేసుకుని అక్కడే స్థిరపడిపోయారు. రెండుమూడేళ్లకు ఓసారి వచ్చి నెలరోజులు అమ్మానాన్నలతో గడిపి వెళ్లిపోతుంటారు. వాళ్లు వచ్చివెళ్లినప్పుడు ఇల్లంతా సందడి. ఆ తర్వాత మామూలేగా.

అయితే పిల్లల వైఖరి కృష్ణలీలయ్యకు అంతగా నచ్చేదికాదు. అమ్మతో అవీఇవీ చేయించుకోవడం, తినడం.. మళ్లీ ఏవేవో ప్యాకింగులూ గట్రా చేయించమనడం.. వెరసి అందరూ విమానాలు ఎక్కి వెళ్లిపోయాక.. మధురమ్మ అనారోగ్యంతో మంచం ఎక్కడం.. ఇలాగే ఉండేది.

'ఇప్పటికే పిల్లల కోసం చేసింది చాలు! నీ గురించి కాస్త శ్రద్ధ తీసుకో!' అంటూ అప్పుడప్పుడు భార్యను కూడా ఈ విషయంలో మందలిస్తూ ఉండేవాడు. కానీ, మధురమ్మ అమ్మ మనసు అవన్నీ పట్టించుకునేది కాదు. ఇలా ఉండగా ఓసారి కూతురి దగ్గరి నుంచి ఫోన్ వచ్చింది.

''అమ్మా! నాకు ఏడో నెల. నీకు కావాల్సిన పాస్‌పోర్టు, వీసా అంతా సిద్ధం చేశాను. వచ్చేవారమే వచ్చేయ్. నాకు తోడుగా ఉందూగానీ'' అని క్లుప్తంగా విషయం చెప్పింది.

''ఏడో నెలా!? ఈ శుభవార్త ఇప్పుడా చెప్పేది. కంగ్రాట్స్ తల్లీ! ఆరోగ్యం ఎలా ఉంది'' అని ఎంతో ప్రేమగా అడిగింది మధురమ్మ.

''అంతా ఓకే గానీ.. నేను ఓ లిస్టు పంపుతాను. వచ్చేటప్పుడు ఆ సామాన్లన్నీ వెంట తీసుకుని వచ్చేయ్. సరే ఉంటా'' అని ఫోన్ పెట్టేస్తుండగా..

''వస్తాను గానీ.. ఈ వయసులో నాన్నను ఒంటరిగా వదిలి రావాలంటే?'' అని ఏదో చెప్పబోతుండగా కూతురు కయ్యిమంది.

''ఇప్పుడు నాన్న ఇక్కడికి వచ్చి చేసేదేముంది. నువ్వంటే పాపను చూసుకుంటావు. దండగ ఖర్చులు ఎందుకు చెప్పు'' అంటూ ఫోన్ పెట్టేసింది.

ఇదంతా వార్తాపత్రిక చదువుతున్నట్టు నటిస్తున్న కృష్ణలీలయ్య హాల్లో కూర్చుని లీలగా వింటూనే ఉన్నాడు. భార్య బాధగా ముఖంపెట్టి బెడ్రూమ్ నుంచి బయటకు రావడం చూశాడు.

''ఆ.. ఎప్పుడు అమ్మడూ అమెరికా ప్రయాణం'' అని వెక్కిరించాడు.

''అంటే.. అదీ'' అని భార్య నాన్చడం చూసి సన్నగా నవ్వుకున్నాడు.

''ఏ మాటకామాట చెప్పుకోవాలోయ్. నేను మగాడిగా పుట్టినందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఇదిగో నీలాగా ఆయా పని తప్పింది'' అంటూ పగలబడి నవ్వాడు.

''ఛా ఊరుకోండి. మన పిల్లల సంతానానికి మనం కాకపోతే ఎవరు చేస్తారండీ'' అని భర్తను పైకి మందలించినా.. తన బతుకు అలాగే మారినందుకు చిరాకేసింది మధురమ్మకు లోలోపల.

''అవునా.. అయితే నీ కూతురికి చెప్పి నీకు, నాకు ఇద్దరికీ టిక్కెట్లు బుక్ చేయమను. ఏమంటుందో చూద్దాం'' అని తెల్సిన జవాబే అయినా ప్రశ్నించాడు.

''వాళ్లను మాత్రం ఏం అనగలమండీ. వాళ్ల ఖర్చులు వాళ్లకు ఉంటాయి'' అని భర్తతో పైకి అన్నా కూడా.. మనసులో మాత్రం ఆ కోరిక ఆమెకు లేకపోలేదు.

''అంటే.. ఇప్పుడు వెళ్తానంటావు అంతేనా!? రెండేళ్ల క్రితం వెళ్లావు గుర్తుందా. తమరి వారసుడి తొలి సంతానానికి సేవ చేయడానికి. అక్కడి వాతావరణం, తిండి పడక ఎంతలా విలవిల్లాడిపోయావు. ఇక్కడికి రావాలని ఉన్నా బుడ్డోడికి సకల సేవలు చేయాల్సి రావడంతో అక్కడే ఉండిపోయావు. రాత్రనకా పగలనకా వాళ్లు షికార్లు, పార్టీలు

